క్లుప్తంగా

వైభవంగా వెంకన్న ఆలయ వార్షికోత్సవం


పెనుగొండలో హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: పెనుగొండలో అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు బుధవారం వేద పండితుడు ఖండవల్లి సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో రుత్విక్కులు వెంకటేశ్వర స్వామికి అర్చనలు, అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చనలు, హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మేళ తాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కోలాట, భజన మండలి సభ్యులు ఆధ్వర్యంలో కోలాటాలు, భజనలు ఆకట్టుకున్నాయి.

వెలివెలలో వైభవంగా రథోత్సవం


రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని వెలివెలలో ఉన్న శ్రీ ఉమా సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ రాధాకృష్ణ స్వామివార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. రథాన్ని లాగడానికి మహిళలు, యువజనులు, పెద్దలు, చిన్నారులతో పోటీ పడి భక్తిని చాటారు. అలాగే వసంతోత్సవం నిర్వహించారు. స్వామివార్ల కల్యాణం నిర్వహించిన బోడపాటి విజయ్‌కుమార్– లక్ష్మీ నాగమణి, గ్రామ పెద్దలు బోడపాటి వెంకటనారాయణ, గ్రామ సర్పంచ్ కెల్లా సింహాచలం, ఉప సర్పంచ్ కందుల వెంకటేశ్వరరావు, మహిళలు, యువజనులు ఉత్సవమూర్తుల ఉన్న రథాన్ని లాగడానికి పోటీ పడ్డారు. మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్

నరసాపురం: రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యతని మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ అన్నారు. బుధవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన రాజ్యాంగ పరిరక్షణ సదస్సుల్లో ఆయనన మాట్లాడారు. భారత రాజ్యాంగం పౌరులకు ప్రాథమిక హక్కులు కల్పించిందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ పౌరుల హక్కులు హరించే విధాలనాలతో ముందుకు వెళుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.త్రిమూర్తులు, చదవాడ జ్ఞానప్రకాష్, సోడదాసి శ్రీధర్, ఎండీ షాన్‌వాజ్‌ఖాన్, జల్లి రామ్మోహన్, పొన్నాడ రాము, ఎం.వివరాజు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ఉండి: మండలంలోని యండగండిలో పేకాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, రూ.23,800, ఆరు సెల్‌ఫోన్లు, ఏడు ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.గంగాధరరావు తెలిపారు.

అన్నదమ్ములపై దాడి

ఉండి: స్థానిక రామానంద్‌నగర్ ప్రాంతానికి చెందిన టైల్స్, సీలింగ్ పనిచేసే కన్నీటి శివసాయి, రాజేష్ అనే అన్నదమ్ములు మంగళవారం గ్రామంలోనే పనిచేసే ప్రాంతంలో గొడవ జరిగింది. వారు పనిముగించుకుని ఇంటికి వచ్చేశారు. గొడవ నేపథ్యంలో అంజనపూడి సరేష్, అమరగంటి రాకేష్, పైలా మధుకుమార్ మరి కొందరు గొడవపడి శివసాయి, రాజేష్‌ల ఇంటికి వచ్చి దాడి చేశారు. గాయాలపాలైన శివసాయి, రాజేష్ భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.గంగాధరరావు తెలిపారు.

పంచారామక్షేత్రం ఈఓగా సురేష్ నాయుడు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక పంచారామ క్షేత్రం కార్యనిర్వహణ అధికారిగా చాగంటి సురేష్ నాయుడు బుధవారం బాధ్యతలను చేపట్టారు . కాళ్లకూరు వేకటేశ్వర స్వామి వారి దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న ఆయన బదిలీపై పంచారామ క్షేత్రానికి వచ్చారు. ఈ సందర్భంగా ఈవో సురేష్ నాయుడు మాట్లాడుతూ పంచారామ క్షేత్రంలో త్వరలోనే నిత్య అన్నదానం ప్రారంభిస్తామన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'కు అనూహ్య స్పందన


ఇలపర్రులో 'జగనన్నే మా భవిష్యత్' నిర్వహిస్తున్న నాయకులు


చింతపర్రులో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు

పెనుగొండ: 'జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్'కు అనూహ్య స్పందన లభిస్తుంది. బుధవారం ఇలపర్రులో పెనుగొండ మండల సర్పంచ్‌ల చాబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి ఆధ్వర్యంలో వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పడమట్ల పద్మనాగేశ్వరి, సొసైటీ అధ్యక్షుడు యాండ్ర వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, వేగిరాజు శ్రీనివాసరాజు, పీతల మందులు, పడపట్ల మధు, గుణపాటి సంజీవరావు, నక్క రాజశేఖర్‌లు పాల్గొన్నారు. పెనుగొండలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్‌కు ఇంటింటా స్పందన విశేషంగా లభించింది. కార్యక్రమంలో ఎంపీటీసీ తాడి సుబ్బిరెడ్డి, కన్వీనర్లు, పంచాయతీ సభ్యులు దొమ్మేటి దేవి, పూతినీడి శ్రీను, పార్టీ నాయకులు వేండ్ర లీలా వెంకట రమణ, చేవూరి శ్రీనులు పాల్గొన్నారు. సిద్ధాంతం, ములపర్రు, నడిపూడి, చినమల్లం, కొఠాలపర్రు, తామరాడ, దేవల్లోనూ జోరుగా నిర్వహించారు. ఆచంట మండలంలో ఆచంట, కొడమంచిలి, పెనుమంచిలి, కోడేరు, భీమలాపురం, వల్లూరుల్లోనూ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: ప్రజల సంక్షేమం కోసం అహర్నిసలు శ్రమించే మనసున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు అన్నారు. పాలకొల్లు మండలం చింతపర్రు, ఆగర్తిపాలెం గ్రామాల్లో బుధవారం జగనన్న మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఆయన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ప్రజల అభిప్రాయం మేరకు డోర్ స్టికర్లు అంటించి రాబోయే కాలంలో సీఎం జగన్ నాయకత్వాన్ని ప్రతీ ఒక్కరూ బలపరచాలని కోరారు. ఆయన వెంకట వైస్ ఎంపీపీ పడవల సునీల్ బాబు, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో దేశంలోనే మన రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ అన్నారు. జగనన్నే మా భవిష్యత్–మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మొగల్తూరు మూడో సచివాయం పరిధిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలు, మతాలు, కులాలకతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నాయకులు, గృహ సారథులు, కన్వీనర్లు, వాలంటీర్లు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ లబ్ధిని వివరిస్తూ బ్రోచర్‌లు అందించారు.

యలమంచిలిలో..

యలమంచిలి: మండలంలోని 32 గ్రామాలలో 'జగనన్నే మా భవిష్యత్– నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతుంది. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేసిన, చేస్తున్న పథకాలను వివరిస్తున్నారు. ప్రజలు ఏ చిన్న సమస్య చెప్పినా సావధానంగా విని నమోదు చేసుకుంటున్నారు. అనంతరం ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. మేడపాడు గ్రామంలో బుధవారం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, సర్పంచ్ గంటా శాంతకుమారి, ఎంపీటీసీ దేగల సూర్యప్రభ, సచివాలయ కన్వీనర్లు అడబాల రామ్మోహనరావు, కుక్కల బాలచంద్రన్, కుసుమే సోని ఇళ్లకు వెళ్లి ప్రజాభిప్రాయం సేకరించారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. నరసాపురం మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, గృహ సారథులు, పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎల్బీచర్లలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ యమునా భానుమూర్తి, సంగాని వెంకటదుర్గా భవాని, బొడ్డు ఆశీష్‌కుమార్, అయ్యగారి గోపాలకృష్ణ, రాట్నల రాము, పెదపట్నం శ్రీనివాస్, కటకంశెటిట్టి మామాజీ తదితరులు పాల్గొన్నారు.


కొప్పర్రు పెదపేటలో లబ్ధిదారులకు బ్రోచర్లు ఇస్తున్న నాయకులు


పెనుగొండలో జగనన్నే మా భవిష్యత్ నిర్వహిస్తున్న నాయకులు


మేడపాడులో లబ్ధిదారులతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తహసీల్దార్‌గా సుబ్రహ్మణ్యం

పెనుగొండ: ఆచంట తహసీల్దార్‌గా ఎస్వీకే సుబ్రహ్మణ్యం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి డిప్యూటేషన్‌పై ఆచంటకు బదిలీ కావడంతో బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని వీఆర్వోలు, వీఆర్ఏలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

పెద్దిరాజుకు సత్కారం


అంబేద్కర్ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

పోడూరు: మండలంలోని వేడంగి మెయిన్ ప్రాథమిక పాఠశాలలో నంది అవార్డు గ్రహీత డాక్టర్ కోలాటి పెద్దిరాజును ఘనంగా సత్కరించారు. బుధవారం పాఠశాలలో హెచ్‌ఎం గెద్దాడ పెద్దిరాజు ఆధ్వర్యంలో ముందస్తుగా అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రిటైర్డ్ హెచ్‌ఎం కొట్టి భాస్కరరావు, కోలాటి పెద్దిరాజు విద్యార్థులకు అంబేద్కర్ భావజాలంపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు బహుమతులనూ, డాక్టర్ అంబేద్కర్ క్లుప్త జీవిత చరిత్ర పుస్తకాలను అందించారు.

ఆధ్యాత్మిక సేవలకు దాతల సహకారం అవసరం


పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న జడ్పీచైర్మన్ కవురు శ్రీనివాస్


పాలకొల్లులో శ్రీ కనకదుర్గమ్మ ఆలయానికి 4 కిలోల వెండిని జెడ్పీ చైర్మన్ చేతులు మీదుగా అమ్మవారికి సమర్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: దేవాదాయ, ధర్మదాయ శాఖకు చెందిన దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా పరిషత్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని యడ్లబజారులో ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వారి ఆలయంలో దాతలు కోరుమిల్లి సత్యనారాయణ రూ.లక్ష, దేవళ్ల నరసింహమూర్తి రూ.60 వేలు, వేండ్ర వెంకటేశ్వరరావు రూ.50 వేలు, కుంపట్ల నాగ శ్రీనివాస్ రూ.25 వేలు, నుదురుపాటి హరిగోపాలశర్మ రూ.20 వేలు, కావలి మణికంఠ రూ.10 వేలు, గాదె వెంకన్న రూ.10 వేలు తదితరులు అందజేసిన రూ.4.50 లక్షలతో నిర్మించిన రెండు గదులను బుధవారం శ్రీనివాస్ ప్రారంభించారు. అలాగే పట్టణానికి చెందిన నెక్కంటి ఆదినారాయణ 4 కేజీలు వెండిని విరాళంగా జెడ్పీచైర్మన్ శ్రీనివాస్ చేతుల మీదుగా శ్రీ కనకదుర్గమ్మ ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కావలి శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, చింతలపూడి వైఎస్సార్ సీపీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, ఆలయ చైర్మన్ కావలి శ్రీనివాసరావు, ట్రస్టీలు, పెదగోపురం చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, చినగోపురం చైర్మన్ గాదె వెంకన్న, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ జోగి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ దేగల సూర్యప్రభ, ఈఓ ఎన్.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత

ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్లు బాధ్యతగా పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్మన్, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ కోరారు. పోడూరు మండలంలోని 8 గ్రామాల్లో ఎంపికైన వలంటీర్లకు పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నియామక పత్రాలు అందజేసి అభినందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైన్యంలో చేరిన వలంటీర్లు ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను నూతన వలంటీర్లు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.కన్నమనాయుడు, వైస్ ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, జిన్నూరు, పెనుమదం సొసైటీ అధ్యక్షులు పెన్మెత్స వెంకట సూర్యనారాయణ రాజు (డీటీడీసీ బాబు), కొర్రపాటి వీరాస్వామి, జిన్నూరు సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, బళ్ల రాజశేఖర్, వడ్లపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాడవలో పోలీసుల విస్తృత తనిఖీలు


బాడవలో ఇటుక బట్టీల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు


సిబ్బందికి సూచనలిస్తున్న పాలకొల్లు రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు

యలమంచిలి: మండలంలోని బాడవ గ్రామంలో వందల సంఖ్యలో ఇటుక బట్టీలు ఉంటాయి. ఈ బట్టీలలో బీహార్, పశ్చిమబంగ్లా నుంచి వలస వచ్చిన కార్మికులు అధికంగా పని చేస్తుంటారు. ఈ క్రమంలో వారేమైన గంజాయి, సారాయి వంటి మత్తు పదార్థాలు రవాణా చేస్తున్నారా? వారి ఇళ్లలో నిల్వలు ఉంచారా? అనే అనుమానంతో జిల్లా ఎస్పీ యు రవి ప్రకాష్, నరసాపురం డీఎస్పీ కె.రవి మనోహరచారి ఆదేశాల మేరకు పాలకొల్లు రూరల్ సీఐ కొండవీటి శ్రీనివాసకుమార్ పర్యవేక్షణలో యలమంచిలి, పాలకొల్లు రూరల్ ఎస్సైలు జాజుల విజయ్ నాగ ప్రసాద్, సరిదే శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఇటుక బట్టీలన్నింటినీ ఏక కాలంలో చుట్టుముట్టి వారి బ్యాగులు, ఇతర లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. బట్టీలన్నింటినీ తనిఖీ చేసిన అనుమానాస్పద వస్తువులు ఏవీ కనిపించలేదని పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో పెద్ద సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్లు సిద్ధం

పాలకోడేరు: జగనన్న విద్యా కానుక కిట్ల భద్రతపై బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర పాఠ్యపుస్తక అభివృద్ధి అధికారిణి డి.మాధవీలత అధికారులకు సూచించారు. పాలకోడేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్ల నిల్వ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులందరికీ ఒకే దఫాలో విద్యా కానుక కిట్లను పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. జేవీకే నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ ఎంఎస్ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

చిన్నారులకు అండగా శ్రీరంగనాథరాజు


అయోధ్యలంకకు చెందిన సతీష్‌కు భరోసా నిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: తల్లిదండ్రులను కోల్పోయి నానమ్మ వద్ద జీవనం సాగిస్తున్నబొంతు సతీష్, బొంతు సన్ని ప్రవీణ్ కుమార్‌లకు అండగా ఉంటానని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. అయోధ్యలంకలో బొంతు చిట్టిబాబు, బొంతు వరలక్ష్మిలు గత కొత కాలం మృతి చెందడంతో వారి కుమారులు నానామ్మ వద్దే జీవనం సాగిస్తూ విద్యాభ్యాసం చేస్తున్నారు. దీంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అయోధ్యలంక వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకు వెళ్లడంతో ఇరువురు కుమారులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. దీనిలో భాగంగా బుధవారం తూర్పుపాలెంలో కార్యాలయంలో వారి విద్యాభాసానికి ఏర్పాట్లుతో పాటు, మధ్యలోనే నిలిచిన ఇంటి నిర్మాణానికి ఏర్పాట్లు చేశారు. దీనికి కుమారుల మేనమామలతో పాటు, పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కంచుస్తంభం శ్రీను, సరేళ్ల రాజు, పోతుమూడి సత్యనారాయణ, గూటం ఏడుకొండలు పాల్గొన్నారు.

గొల్లవానితిప్పలో భూ రీసర్వే

భీమవరం అర్బన్: భూ వివాదాలు లేకుండా శాశ్వతంగా భూ హక్కు పత్రాలను రైతులకు అందజేసి వారికి మేలు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకాన్ని ప్రవేశపెట్టారనిసర్వే ఆఫ్ ఇండియా టీమ్ డ్రోన్ పైలెట్ వి.ప్రసాద్ అన్నారు. మండలంలోని లోసరి గుట్లపాడు ఏరియాలోని గొల్లవానితిప్పలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా బుధవారం డ్రోన్ సహాయంతో భూములు రీ సర్వే చేశారు.

ముగిసిన హరికథ సప్తాహ మహోత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక త్యాగరాజ భవనంలో చెరుకువాడ సోదరుల నిర్వహణలో హరికథ సప్తాహ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి ముందుగా మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం ఆస్థాన వేద పండితులు బ్రహ్మశ్రీ ఈమని రామచంద్ర ఘనాపాటి జ్యోతి ప్రజ్వలన చేసి దైవ సంకల్ప బలమే ఏ ధర్మ కార్యక్రమానికి అయిన పునాది అని, మనం కేవలం నిమిత్తపత్రులమని, 7 రోజులు శ్రీరామ గాథ హరికథలు నిర్వహించి అందరికీ శ్రీరాముని ఆశీస్సులు ఉండాలని భక్తి పూర్వకంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం శ్రీసత్యసాయి సేవా సమితి సహకారంతో 500 మందికి అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులను సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ బొమ్మిడి నారాయణరావు, గ్రంథాలయ మాజీ చైర్మన్ వబిలిశెట్టి కనకరాజు, మావుళ్ళమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ గునుపూటి తిరుపాల్, డాక్టర్ గంధం వెంకట విశ్వేశ్వరరావు, చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి, పురిగళ్ళ రమణ మూర్తి, సాయి పవన్ , రాయప్రోలు చలపతి పాల్గొన్నారు.

డ్రెయిన్‌లోపడి వ్యక్తి గల్లంతు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వ్యక్తి ప్రమాదవ శాత్తు డ్రెయిన్‌లో కాలుజారి పడిపోయి ఎంతసేపటికి ఆయన ఆచూకీ దొరకకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం తోకతిప్ప గ్రామానికి చెందిన తుంగా ఏసురాజు తన స్నేహితుడితో కలిసి గ్రామంలో యనమదుర్రు డ్రెయిన్ బ్రిడ్జివద్ద కూర్చుని మాట్లాడుకుంటుండగా ఏసురాజు ప్రమాదవశాత్తు కాలు జారి డ్రెయిన్‌లో పడిపోయాడు. ఎంతసేపటికి అతని ఆచూకి దొరకకపోవడంతో ఆయన భార్య తుంగా లక్ష్మి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ మహేశ్వరరావు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటమి భయంతోనే డ్రామా యాత్రలు


చిట్టూరి కనకలక్ష్మి

పాలకొల్లు అర్బన్: ఓటమి భయంతోనే ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు డ్రామా యాత్రలు మొదలు పెట్టారని ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి పేర్కొన్నారు. సామాజిక గుర్తింపు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని వివరించారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. సామాజిక చైతన్య యాత్ర పేరుతో పాలకొల్లు మండలంలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు చేపట్టిన పాద యాత్ర పై ఎంపీపీ తీవ్రంగా మండిపడ్డారు. గత నాలుగేళ్ల కాలంలో సమాజంలోని అన్ని వర్గాలకు ప్రయోజనం కల్పించిన ఘనత సీఎం జగన్‌దన్నారు. దళిత, బహుజనుల సబ్సిడీ రుణాల పథకాలను రద్దు చేశారని ఎమ్మెల్యే నిమ్మల చేస్తున్న ప్రచారం అర్థరహితమన్నారు. నియోజకవర్గంలో ఎస్సీ, బీసీల పేరు చెప్పి అరకొరగా ఇచ్చిన సబ్సిడీ రుణాలను టీడీపీ నాయకులు ప్రయోజనం పొందారని గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో ఓటమి భయంతో ఎమ్మెల్యే నిమ్మల ప్రజలను మభ్యపెట్టేందుకు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, బీసీ, ఓబీసీ, అగ్రవర్ణ పేదలు ప్రయోజనం పొందరన్నారు.

ఇంటి మరమ్మతులకు సాయం


సిమెంట్, ఇసుక అందిస్తున్న దండు పద్మావతి

పెనుగొండ: గడపగడపకూ మన ప్రభుత్వంలో శిథిలావస్థకు చేరిన ఇంటి మరమ్మతలకు ఇబ్బందులు పడుతున్నామంటూ ఇలపర్రు వాసి నెక్కంటి వీరన్న, చింతాలమ్మ దంపతుల వినతికి స్పందించి ఇలపర్రు సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి ఏర్పాటు చేసి ఔదార్యాన్ని చాటుకొన్నారు. బుధవారం ఇలపర్రులో నెక్కంటి వీరన్న ఇంటి మరమ్మతులకు అవసరమైన 20 బస్తాల సిమెంట్, ఇసుక, ఇతర సరుకులను స్వయంగా అందించారు. వీరన్న దంపతులు సర్పంచ్ పద్మావతికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పడపట్ల పద్మనాగేశ్వరి, సొసైటీ చైర్మన్ వేండ్ర వెంకటేశ్వర్లు, మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, వేగిరాజు శ్రీనివాస్, దిడ్ల శ్రీను, యల్లమెల్లి భీమయ్య, మధు పాల్గొన్నారు.

వ్యాపారులకు లైసెన్స్‌లు తప్పనిసరి

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణం, ఆకివీడు, ఉండి, కాళ్ల మండలాల పరిధిలోని దుకాణాలు, సంస్థలు, వాహనాల యజమానులు లైసెన్స్ రెన్యువల్ చేయించుకోవాలని భీమవరం 2వ సర్కిల్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.శివనాగమల్లేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనేకమంది లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. లైసెన్స్ కోసం గ్రామ, వార్డు సచివాలయం, మీసేవా కేంద్రాల్లోను లేదా స్వయంగా కార్మిక శాఖ పోర్టల్ ద్వారా లైసెన్స పొందవచ్చని పేర్కొన్నారు లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు.